ప్రజాశక్తి

ఆదివారం 31 డిసెంబర్ 2023 | 5 | అనంతపురం



నేరాలు తగ్గుముఖం

◆ ఎస్సీ,ఎస్టీ, మహిళలపై హింస పెరుగుదల
◆ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి
◆ 2023 నేరాల గణాంకాలు వెల్లడించిన ఎస్పీ అన్బురాజన్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో మొత్తం నేరాల నమోదులో తగ్గుదల ఉన్నప్పటికీ, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ, మహిళలపై హింస కేసుల నమోదులో పెరుగుదల ఉంది. 2023 సంవత్సరంలో అనంతపురం జిల్లాకు సంబంధించిన నేరాల గణాంకాలను ఎస్పీ అన్బురాజన్ శనివారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసు కాన్ఫరెన్సు హాలులో జరిగిన ఈ సమావేశంలో వివరాలు తెలియజేశారు. ఆయన తెలిపిసన సమచారం మేరకు వివరాలు ఈ విధంగానున్నాయి.

ఎస్సీ,ఎస్టీ మహిళలపై హింస పెరుగుదల

జిల్లాలో మహిళలపై జరిగిన హింసకు సంబంధించిన కేసుల నమోదులో 2022 సంవత్సరం కంటే 2023లో పెరుగుదల ఉంది. 2022వ సంవత్సరంలో జిల్లా పరిధిలో 678 కేసులు నమోదవగా, 2023వ సంవత్సరంలో 730 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా చూసినప్పుడు అంతకు మునుపు ఏడాది కంటే ఎనిమిది శాతం కేసుల నమోదు పెరిగింది. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు 2022వ సంవత్సరంలో 119 కేసులు నమోదవగా ఈ ఏడాది 124 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల సంఖ్య నాలుగు శాతం పెరిగింది. ఇక పోక్సో కేసుల విషయానికి వస్తే 2022వ సంవత్సరంలో 90 కేసులు నమోదవగా ఈ ఏడాది 87 కేసులు నమోదయ్యాయి. మూడు శాతం కేసులు తక్కువ అయినట్టు ఎస్పీ వెల్లడించారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో 27 శాతం వాటిల్లో శిక్షలు పడే విధంగా చేయగలిగామని వివరించారు.

ఆస్తి నేరాల్లో తగ్గుదల

ఆస్తి నష్టానికి సంబంధించిన కేసుల్లో 15 శాతం నేరాలు తగ్గాయి. 2022వ సంవత్సరంలో 577 కేసులు నమోదవగా 2023లో 491 కేసులు నమోదయ్యాయి. ఇందులో లాభం కోసం జరిగిన హత్యలు ఒక్కటీ లేవు. కాగా డెకాయిట్‌లు 2022లో ఒకటి జరిగితే ఈ ఏడాది రెండు జరిగాయి. దోపిడీలు 2022లో ఏడు జరిగితే ఈ సంవత్సరం తొమ్మిది జరిగాయి. పగటిపూట ఇళ్లలో చోరీలు అంతకు మునుపు ఏడాది 50 జరిగితే ఈ సంవత్సరం 26 జరిగాయి. రాత్రి చోరీలు అంతకు మునుపు ఏడాది 114 జరిగితే ఈ ఏడాది 104 జరిగాయి. సాధారణ దొంగతనాలు అంతకు మునుపు ఏడాది 405 జరిగితే ఈ ఏడాది 350 జరిగాయి. ఇక మొత్తం ఆస్తి నష్టం అంతకు మునుపు ఏడాది రూ.6 కోట్లు జరిగితే ఈ ఏడాది రూ.11.79 కోట్లు జరిగింది. ఇందులో రికవరీ అంతకమునుపు ఏడాది రూ.3.71 కోట్లు చేయగా, ఈ ఏడాది ఏడు కోట్లు చేశారు.

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

సైబర్ నేరాలను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. ఇందులో భాగంగా సైబర్ నేరగాళ్ల ముఠా నాయకుడు అనయతుల్లా అలియాస్ పర్వాన్‌ను జమ్ముకాశ్మీర్‌లో అరెస్టు చేసినట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా సైబర్ మోసానికి పాల్పడినట్టు తేలింది. సుమారు రూ.350 కోట్లు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఎఇపిఎస్ కింద బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కొట్టేసిన వాటికి సంబంధించి జిల్లాల 1317 ఫిర్యాదులు అందితే 1121 కేసులను పరిష్కరించినట్టు తెలిపారు. 196 కేసులు విచారణ దశలోనున్నట్టు ఎస్పీ తెలిపారు. రూ.1.95 కోట్లు బాధితులు మోసపోతే 1.66 కోట్లు రికవరీ చేశారు. వైట్ కాలర్ నేరాల్లోనూ తగ్గుదల ఉంది.

మొత్తంగా కేసులు తగ్గుదల

జిల్లాలో మొత్తంగా కేసుల నమోదు చూసినప్పుడు 2022లో 8763 కేసులు నమోదవగా ఈ ఏడాది 8599 నమోదయ్యాయి. అంతకు మునుపు ఏడాది కంటే ఈసారి రెండు శాతం కేసుల నమోదు జరిగింది. రోడ్డు ప్రమాదాలు 2022లో 540 జరగ్గా ఈ ఏడాది 539 జరిగాయి. సెబ్ విభాగం ద్వారానూ అక్రమ మద్యం రాకుండా నివారించే చర్యలతోపాటు, నాటుసారా కాచేవారిపైనా కేసులు నమోదు చేయడం జరుగుతోందని వివరించారు. ఈ ఏడాది 1567 కేసులు నమోదవగా 1695 మందిని అరెస్టు చేశారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేసామని ఎస్పీ వివరించారు.

కళ్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీ చరణ్ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు, కార్యకర్తలు



ఉప్పెనలా ఉద్యమం

జిల్లాలో అంగన్‌వాడీల ఉద్యమం ఉప్పెనలా కొనసాగుతోంది. ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. మొక్కవోని పోరాట సంకల్పంతో వీరు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేసి పనిభారం తగ్గించాలనే తదితర డిమాండ్లతో సమ్మెను కొనసాగిస్తున్నారు. దీక్షా శిబిరాల వద్ద రోజుకో రూపంలో నిరసన తెలియజేస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని అడుగడుగునా ఎండగడుతున్నారు. సమ్మెను ప్రారంభించి 19 రోజులు అవుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంపై అంగన్‌వాడీలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ ఆగని అంగన్‌వాడీల పోరు ◆ మంత్రి ఉషశ్రీచరణ్ ఇల్లు ముట్టడి
◆ సిఐటియు నాయకులు అంగన్‌వాడీల అరెస్టు ◆ ఖండించిన సిపిఎం



అరెస్టు అనంతరం కళ్యాణదుర్గం పోలీసు స్టేషన్‌లో ఉన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ తదితరులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం , అనంతపురం కలెక్టరేట్.

సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీ చరణ్ ఇంటిని ముట్టడించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు కళ్యాణదుర్గంకు బయల్దేరారు. అయితే వీరిని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. పోలీసుల ఆంక్షలను ఎదిరించి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు కళ్యాణదుర్గంకు చేరుకుని మంత్రి ఉషశ్రీచరణ్ ఇంటిని ముట్టడించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 3000 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. శనివారం ఉదయం కళ్యాణదుర్గం తహశీల్దార్ కార్యాలయం వద్ద బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడి నుంచి మంత్రి నివాసాన్ని ముట్టడించేందుకు దశలవారీగా బయల్దేరారు. అప్పటికే మోహించిన పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. బలవంతంగా అరెస్టులకు ఉపక్రమించారు. మహిళలని చూడకుండా విచక్షనా రహితంగా ఈడ్చిపారేశారు. వ్యాన్లు, ఆటోల్లో అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులను బలవంతంగా కళ్యాణదుర్గం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇదే సమయంలో మరికొందరు అంగన్‌వాడీలు టీసర్కిల్లో బైటాయించారు. అక్కడ కూడా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు పోలీసులపై తిరగబడడంతో ఖాకీలు మిన్నకుండిపోయారు. దీంతో అంగన్‌వాడీలు ర్యాలీగా మంత్రి ఉషశ్రీచరణ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. మంత్రి ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాదాపు మూడు గంటల పాటు ఎండలోనే రోడ్డుపై బైటాయించారు. మంత్రి ఉషశ్రీచరణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అరెస్టులు.. ఉద్రిక్తం..!

మంత్రి ఇంటి వద్దకు పెద్దఎత్తున అంగన్‌వాడీలు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మంత్రి ఇంట్లోకి వెళ్లేందుకు సిఐటియు నాయకులు, అంగన్‌వాడీలు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టులు చేశారు. బలవంతంగా అరెస్టు చేసే క్రమంలో తీవ్ర తోపులాట జరిగింది. ఇష్టం వచ్చినట్లు లాగిపడేశారు. మగపోలీసులు అంగన్‌వాడీలను విచక్షణా రహితంగా ఈడ్చేపడేశారు. ఈ క్రమంలో పలువురు అంగన్‌వాడీలకు గాయాలు అయ్యాయి. ఓ అంగన్‌వాడీ కార్యకర్త సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే ఆమెను ఆర్డీటీ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, అధ్యక్షురాలు నాగమణి, జిల్లా కోశాధికారి టి.గోపాల్, జిల్లా నాయకులు తలారి రామాంజినేయులు, వెంకటనారాయణ, ముత్తుజా, జయమ్మ, మల్లికార్జున, లోకేష్, పోతులయ్య, మల్లికార్జున అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, జయభారతి, జమున, సువర్ణ తదితరులను అరెస్టు చేసి కళ్యాణదుర్గం పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

హామీల అమలుపై స్పష్టత కరువు

అంగన్‌వాడీలు ఆందోళన చేస్తున్న సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్‌తో మాట్లాడేందుకు పోలీసులు ఐదుగురు అంగన్‌వాడీ యూనియన్ నాయకులకు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఐదుగురు మంత్రితో మాట్లాడేందుకు వెళ్లారు. అయితే అక్కడ మంత్రి హామీలపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండానే సమ్మెను విరమింపజేయాలని కోరారు. సంక్రాంతి తరువాత అన్నీ పరిష్కారం అవుతాయని చెప్పుకొచ్చే ప్రయత్నం చేశారు. హామీల అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన సంకేతాలు ఇస్తామంటనే సమ్మెను విరమింజేస్తామని అంగన్‌వాడీలు తేల్చిచెప్పారు. మంత్రి మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోడంతో సమ్మెను కొనసాగిస్తామని చెప్పి అంగన్‌వాడీలు బయటకు వచ్చేశారు.

గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు..!

ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను మాత్రమే తాము అమలు చేయాలని కోరుతున్నామని, గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని తెలిపారు. కనీస వేతనం, గ్రాట్యుటీ, పనిభారం తగ్గింపు, ఉద్యోగభద్రతను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం వల్లనే చేసేది లేక సమ్మెలోకి వెళ్లామన్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్రలను మానుకుని న్యాయమైన సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం స్పందించేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మిడ్‌డే మీల్స్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి గోపాల్, అచ్యుత్‌ప్రసాద్, ముత్తుజ, వెంకటనారాయణ, మల్లికార్జున, లోకేష్, రామాంజి, పోతులయ్య, తిప్పేరమ్మ, మేరీ, గోవిందమ్మ, అరుణ, పాతక్క, వన్నూరమ్మ, రాధ, తులసి, లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

అనంతలోనూ అరెస్టులు

అనంతపురం నుంచి వెళ్తున్న అంగన్‌వాడీల వాహనాలను కళ్యాణదుర్గం రోడ్డు నరిగమ్మ దేవాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వాహనాల్లో ఉన్న వారందరినీ బలవంతంగా కిందకు దింపేశారు. ఈ సమయంలో అంగన్‌వాడీలు, పోలీసుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. తాము సమస్యలను మంత్రికి చెబుదామని వెళ్తుంటే ఇలా అడ్డుకోవడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను కళ్యాణదుర్గంకు పంపాల్సిందే అంటూ రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. పెద్దఎత్తున అక్కడికి చేరుకున్న పోలీసులు అంగన్‌వాడీ, సిఐటియు నాయకులు లతీఫ్, ఆజాంబాషా, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాతక్క, సువర్ణమ్మ, తిప్పేరమ్మ, కాత్యాయని, విజయనిర్మల తదితరులను బలవంతంగా అరెస్టు చేసి 4వ పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులను సిపిఎం నాయకులు ఖండించారు. పోలీసు స్టేషన్‌లో ఉంచిన అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులను సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పరామర్శించారు. అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు అరెస్టు చేసిన వారందరినీ సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. 20 రోజులుగా వారు ఆందోళనలు చేస్తుంటే పట్టనట్లు వ్యవహరించడం పద్ధతి కాదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే వైసిపి అంగన్‌వాడీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పోలీసుస్టేషన్‌లో అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న రాంభూపాల్





గుంతకల్లులో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

సడలని సమ్మె

జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల ఆందోళనలు

సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె జిల్లా వ్యాప్తంగా ఉధృతంగా కొనసాగుతోంది. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. ఆయా మున్సిపాల్టీల పరిధిలో వివిధ రూపాల్లో కార్మికులు నిరసనలు చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయాల ముందు బైఠాయించి ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అనంతపురం కార్పొరేషన్ వద్ద నల్లదుస్తులు ధరించి నిరసన తెలిపారు. వీరికి మేయర్ వసీం మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. గుంతకల్లులో అర్ధనగన్న ప్రదర్శన చేపట్టారు. వీరికి పలు కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగులు మద్దతు తెలుపుతున్నారు.

వార్త 6లో

వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు

తొలగించిన రైతులు



స్మార్ట్‌మీటర్లను తొలగిస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్ రూరల్

మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో వ్యవసాయ పంపుసెట్లకు బిగించిన స్మార్ట్ విద్యుత్ మీటర్లను శనివారం రైతులు తొలగించారు. అంతకుముందు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, గుంతకల్లు రైతు సంఘం మండల కార్యదర్శి దాసరి శ్రీనావాసులు, రైతు సంఘం నాయకులు రామునాయక్ గ్రామంలో పర్యటించి వ్యవసాయ పంపు సెట్లకు బిగించిన స్మార్ట్ మీటర్ల ద్వారా జరిగే నష్టాన్ని రైతులకు వివరించారు. దీంతో రైతులు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వాలని, పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఆపాలని, పెట్టిన మీటర్లను తొలగిస్తామని వ్యవసాయ పంపుసెట్ల కాంట్రాక్టర్లకు ఫోన్ ద్వారా తెలిపి మీటర్లను తీసుకెళ్లమన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) 2024 నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. శనివారం నాడు ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా విద్యా శాఖ అధికారి నాగరాజు, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు హాజరై డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎపిటిఎఫ్ పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు రాఘురామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్ధీన్, జిల్లా మాజీ అధ్యక్షులు హనుమప్ప, వెంకటేశులు, డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

'శఠగోపం పెట్టారు'..!

ఎస్ఎస్ఎ ఉద్యోగుల వినూత్న నిరసన



అనంతపురం కలెక్టరేట్ ఎదుట పేపర్లతో తయారు చేసిన శఠగోపం ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి తమకు శఠగోపం పెట్టారని ఎస్ఎస్ఎ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 11వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట సమ్మెలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని విస్మరిస్తూ శఠగోపం పెట్టారంటూ పేపర్లతో తలపై శఠగోపాలు పెట్టుకుని నిరసన తెలిపారు. జేఏసీ ఛైర్మన్ విజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమ్మెకు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మద్దతుగా హాజరై మాట్లాడారు. ఎస్ఎస్ఎ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమస్య న్యాయమైందే అన్నారు. తక్కువ వేతనాలు పని చేస్తూ ఎప్పటికైనా రెగ్యులరైజ్ అవుతాయనే ఆశతో ఉన్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతగా జగన్ కూడా రెగ్యులరైజ్ చేస్తామని హామి ఇచ్చి ఓట్లు వేయించుకుని గెలుపొందారని గుర్తు చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా టిడిపి ఎస్ఎస్ఏ ఉద్యోగుల పక్షాన అండగా ఉంటుందన్నారు. వీరికి మద్దతుగా టిడిపి నగర అధ్యక్షులు మారుతికుమార్‌గౌడ్, లక్ష్మి నరసింహులు, జెఎం.బాషా, సైఫుద్దీన్, యుటిఎఫ్ విడపనకల్, వజ్రకరూర్, ఉరవకొండ మండల శాఖ నాయకులు రామప్పచౌదరి, సంజీవకుమార్, ఉమాపతి, రఘు, బండయ్య, మస్తానప్ప, లక్ష్మన్న, పోతన్నలు హాజరై మద్దతు తెలిపారు. పోరాటాల అవసరార్థం రూ.5116, ఎపిటిఎఫ్ నార్పల మండల శాఖ నాయకులు రంగారెడ్డి, హనుమంతు మద్దతుగా హాజరై రూ.10,116, ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు విష్ణు, బసవరాజు, బసమ్మ, జలజాక్షి, సుగుణ, దాదావలి, సూర్యనారాయణ, నరేంద్ర, రాజశేఖర్, నస్రీం, భారతి, జయమ్మ, రాజేశ్వరి, రత్న తదితరులు పాల్గొన్నారు.

అనంత బాలోత్సవం-4కు ఆత్మీయ ట్రస్ట్ చేయూత



బాలోత్సవం నిర్వహణకు సాయాన్ని అందిస్తున్న ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఫిబ్రవరి 5, 6, 7వ తేదీల్లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే పిల్లల పండుగ అనంత బాలోత్సవం-4కు ధర్మవరం పట్టణానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ రూ.20 వేలు సాయాన్ని కమిటీ నిర్వాహకులకు అందజేశారు. బాలోత్సవం కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రిని ఆత్మీయ ట్రస్ట్ ఛైర్మన్, యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, యుటిఎఫ్ అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, శ్రీసత్యసాయి జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రమణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. బాలోత్సవంలో 36 అకడమిక్, 26 సాంస్కృతిక విభాగాలు మొత్తం 62 ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తారని, కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు జశ్వంత్, కష్ణజా తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఓతురు పరమేష్



ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 27, 28, 29వ తేదీల్లో కాకినాడలో నిర్వహించిన నేపథ్యంలో అనంతపురం జిల్లా నుంచి ప్రతినిధులుగా పాల్గొన్నారు. రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథులుగా ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షులు విపి.సాను హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నునకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా ఓతురు పరమేష్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య వ్యాపారం కాషాయకరణ చేయడం కోసం శ్రీకారం చుట్టిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఇప్పటికే దేశ వ్యాప్తంగా పోరాటం కొనసాగిస్తుందన్నారు.

ఉప్పెనలా ఉద్యమం

నిరవధిక సమ్మెలో భాగంగా 19వ రోజైన శనివారం అంగన్వాడీలు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. పెద్దవడుగూరులో పచ్చిగడ్డి తిని వినూత్నంగా నిరసన తెలిపారు. ర్యాలీలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.



ప్రజాశక్తి-పామిడి

పామిడిలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ శిబిరం నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి ఎపిడిఒ ప్రభాకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి శిబిరం వరకూ ర్యాలీగా వచ్చి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిరవధిక సమ్మెను కొనసాగించారు. వీరికి రైతు సంఘం జిల్లా కమిటీ మెంబర్ అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ సంఘీభావం తెలిపారు. దీక్షలో అంగన్వాడీ కార్యకర్తలు జయంతి, జెఎల్ నారాయణమ్మ, మహాలక్ష్మి, రామాంజనమ్మ, రమాదేవి, సెకునీ, ప్రేమకుమారి పాల్గొన్నారు. **శింగనమలలో** సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. వీరికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. ఎపి వ్య.కా.సం. జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, ప్రాజెక్ట్ లీడర్ రమణమ్మ, మండల అధ్యక్షురాలు భారతి, ప్రమీల మాట్లాడుతూ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి వినతిపత్రం తీసుకునేందుకు నిరాకరించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షలో నాగేశ్వరమ్మ, రామలక్ష్మి, లక్ష్మీదేవి, లక్ష్మి, మహాలక్ష్మి, శ్రీలక్ష్మి, రమాదేవి, రాజేశ్వరి, రాధిక, సుగుణ, కాంతమ్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు. **పెద్దవడుగూరులో** అంగన్వాడీలు పచ్చిగడ్డిని తింటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. దీక్షలో అంగన్వాడీ కార్యకర్తల సంఘం నాయకురాళ్లు నాగరాణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **గుంతకల్లు** పట్టణంలో అంగన్వాడీలు సిఐటియు పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు వైటిసి రమేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రేష్మా గంగా నాయకత్వంలో తిలక్‌నగర్‌లోని సచివాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అక్కడి సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తిమ్మప్ప, సురేంద్ర, యూనియన్ నాయకురాళ్లు నాగమణి, తెలజ, జూలీ, పార్వతీ, మేరీ పాల్గొన్నారు. **గుత్తి** పట్టణంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టారు. వీరి దీక్షా శిబిరాన్ని టిడిపి, జనసేన నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షలో టిడిపి సీనియర్ నాయకులు హరినాథ్‌గౌడ్, మండల, పట్టణ కన్వీనర్లు బర్తివలి, రవిగౌడ్, నాయకులు దిల్కా శీన, ఎన్.కేశవనాయుడు, శ్రీకాంత్‌చౌదరి, ఎస్ఎం.బాషా, వీరేష్, యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు పార్వతి, శారద, కళ్యాణి, గంగ, బావమ్మ, శోభ, తదితరులు పాల్గొన్నారు. **తాడిపత్రిలో** అంగన్వాడీలు ర్యాలీగా పాత మున్సిపల్ కార్యాలయం సచివాలయం వద్దకు వెళ్లి అధికారులకు వినతి పత్రం అందజేశారు. **పుట్లూరులో** అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. దీక్షా శిబిరంలో అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


నార్పల : అంగన్వాడీల దీక్ష శిబిరంలో కూర్చొని సంఘీభావం తెలుపుతున్న బండారు శ్రావణిశ్రీ

అంగన్వాడీలకు బండారుశ్రావణిశ్రీ మద్దతు

నార్పల, పుట్లూరు, శింగనమల, గార్లదిన్నెలో అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెను కొనసాగించారు. వీరి దీక్షా శిబిరాలను శనివారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ ఉక్కుపాదం మోపడం బాధాకరమన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం రెండుసార్లు వేతన సవరణ చట్టం చేసి అంగన్వాడీల వేతనాలు పెంచిందన్నారు. జగనైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలతో చర్చించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు ఉన్నారు.


గుంతకల్లు : సచివాలయ ఉద్యోగులకు వినతి పత్రం ఇస్తూ



పామిడి : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు


పెద్దవడుగూరు : గడ్డి తిని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

సడలని సమ్మె

వినూత్నరీతిలో మున్సిపల్ కార్మికుల నిరసన



గుత్తిలో నల్లదుస్తులు ధరించి నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నిరవధిక సమ్మెలో భాగంగా ఐదవ రోజైన శనివారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బండారి ఎర్రిస్వామి అధ్యక్షతన కార్మికులు నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నగర మేయర్ మహమ్మద్ వసీం, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి వేర్వేరుగా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. మేయర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. నగరంలో పారిశుధ్య పరిస్థితులు క్షీణించకుండా చూడటానికి సహకరించాలని వారిని కోరారు. దీక్షలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సిఐటియు 1, 2వ పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు, గురురాజా, ఇంజినీర్ సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, రాయుడు, నల్లప్ప, మహిళా కన్వీనర్ లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, ఆది, రాఘవేంద్ర ప్రసాద్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శన

గుంతకల్లు : న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ సమ్మె బాట పట్టిన మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.నరసయ్య, పట్టణ అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి సూరి, సిఐటియు పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, రాకెట్ల మస్తాన్, రంగనాయకులు, తిమ్మప్ప, రమణ, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

నల్ల దుస్తులు ధరించి

గుత్తి : మున్సిపల్ కార్మికులు నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. శిబిరంలో సమ్మెకు రాష్ట్ర, జిల్లా నాయకులు బైఠాయించి సంఘీభావం తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. టిడిపి, జనసేన నాయకులు శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. దీక్షలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రామాంజనేయులు, కె.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కే.మహేష్, కోశాధికారి బాలరంగన్న, సహాయ కార్యదర్శి సుంకన్న, నాయకులు బేడల నాగేంద్ర, ఈశ్వరయ్య, పి.ఆంజనేయులు, కె.ఆంజనేయులు, టి.వెంకటేశులు, బి.లక్ష్మయ్య, నల్లమ్మ, ఇంజినీరింగ్ సెక్షన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నాయకులు ఎస్.రాజా, రవిశంకర్, మురళి, నరసింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


అనంతపురంలో శిబిరంలో కూర్చొన్న కార్మికులు,


నాయకులతో మాట్లాడుతున్న అనంత మేయర్ వసీం

పేదలకు దుప్పట్లు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో శనివారం ట్రస్ట్ నిర్వాహకులు పురుషోత్తమమురళీకృష్ణ, నిర్మలమురళి దంపతులు పేద ప్రజలకు దుప్పట్లు, వాటర్ బాటిల్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ప్రవాస భారతీయులు అరుణ, లక్ష్మీరెడ్డి దంపతుల కుమారుడు అనీష్ పుట్టినరోజు సందర్భంగా వారు నగరంలోని ముత్యాలమ్మ కాలనీ, భగత్ సింగ్ నగర్, రాజీవ్ కాలనీ పంచాయతీ-1 సచివాలయం వద్ద దుప్పట్లు, వాటర్ బాటిల్స్, బిస్కెట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో నాగరాజు, లక్ష్మణ్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కేశేపల్లి ప్రమాదంలో మరో విద్యార్థి మృతి

నార్పల : మండల పరిధిలోని కేశేపల్లి బ్రిడ్జి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. కేశేపల్లి బ్రిడ్జి వద్ద శుక్రవారం సాయంత్రం లారీ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో పదో తరగతి విద్యార్థులు గౌతమ్, విష్ణు అక్కడికక్కడే మృతి చెందగా రాజకుళ్లాయప్ప, అభిషేక్‌రెడ్డి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అనంతపురంలోని సవీరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజకుళ్లాయప్ప శనివారం మృతిచెందాడు. అభిషేక్‌రెడ్డి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. విద్యార్థుల మృతితో అనంతపురం సర్వజన ఆసుపత్రి ఆవరణలో తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయుల రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం అనంతరం ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తల్లిదండ్రులకు విద్యార్థుల మృతదేహాలను అప్పజెప్పారు. ఎమ్మెల్యే పద్మావతి తల్లి శ్యామలాదేవి ఆసుపత్రిలో విద్యార్థుల తల్లిదండ్రులను పరామర్శించారు. వైసిపి నాయకులు సత్యనారాయణరెడ్డి, తదితరులు శుక్రవారం రాత్రి ఆసుపత్రిలో విద్యార్థుల తల్లిదండ్రులను పరామర్శించారు. విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, జిల్లా నాయకులు వెంకటనరసానాయుడు కోరారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను ఓదార్చారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

గుత్తి : పట్టణంలోని పారిశ్రామికవాడలో శనివారం ఓ కార్మికుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గుంతకల్లు మండలం వైటి చెరువు గ్రామానికి చెందిన హుస్సేన్(40) స్థానిక పారిశ్రామికవాడలోని ఓ సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో ప్రతిరోజు కూలీ పనికి వచ్చేవాడు. ఈ క్రమంలో సిమెంటు ఇటుకలు అచ్చు వేస్తుండగా యంత్రానికి విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురయ్యాడు. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

తాడిపత్రి రూరల్ : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండల పరిధిలోని గంగాదేవిపల్లి గ్రామం వద్ద తాడిపత్రి-గుత్తి ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. గంగాదేవిపల్లి గ్రామానికి చెందిన కంబగిరి రాముడు(58) అలియాస్ దేవదాస్ రాత్రి ప్రధాన రహదారిపై రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య నీలమ్మ ఉంది.

బజారులో పొర్లాడితే ప్రజల్లో సానుభూతి రాదు

జెసికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి హితవు



వైసిపిలోకి చేరిన శ్రీనివాసులుతో ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి తాడిపత్రి

రాజకీయాల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని, అయితే మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ఓటమిని జీర్ణించుకోలేక దుస్తులు ఊడదీసుకుని బజారులో పొర్లాడితే ప్రజల్లో సానుభూతి రాదని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హితవు పలికారు. టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, జెసి సోదరుల పర్సనల్ అడ్వొకేట్ శ్రీనివాసులు శనివారం వైసిపిలో చేరగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ అమృత్ స్కీం కింద రూ. 63 కోట్లు తీసుకొస్తే కౌన్సిల్‌లో ఆమోదం తెలపలేదన్నారు. అలాంటి ఛైర్మన్ పట్టణాభివృద్ధిపై మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జెసి వైసిపి జెండాలను తొలగించాలనడం సిగ్గుచేటన్నారు. న్యాయవాది శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తాడిపత్రిలో పెద్దారెడ్డి గెలుపు కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. టిడిపి నుంచి ఎవరు విమర్శించినా ఇప్పటి నుంచి నేనే ముందుండి ప్రతి విమర్శ చేస్తానన్నారు.

రైతుల గోడు పట్టించుకోండి

జెసి.ప్రభాకర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

'మాటలు కట్టిపెట్టి ముందు రైతుల పంటలకు సాగునీరు అందించు' అని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకరరెడ్డి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఉద్దేశించి అన్నారు. మండల పరిధిలోని లక్ష్యుంపల్లిలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై జెసి స్పందిస్తూ 'మేము ఏనాడో ఫ్యాక్షన్‌ను వదిలిపెట్టాం.. మళ్లీ నీవు మొదలు పెడతానంటే నిన్ను ఏమనాలి'? అన్నారు. రైతులు మిరప పంటకు ట్యాంకర్ల ద్వారా నీరందిస్తుంటే బాధేస్తోంది. '5 టిఎంసిల నీటిని వృథాగా పెన్నానదికి వదిలించుకుని గుంతలు పూడ్చుకుంటివి గానీ రైతులకు సాగునీరు లేకుండా చేశావు' చేతనైతే రైతుల పంటలకు సాగునీరు ఇప్పించు అని సవాల్ చేశారు. పత్తి పంటకు ధర లేక రెండేళ్ల నుంచి రైతులు నిల్వ ఉంచుకున్నారని ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజలకు టిడిపి మినీమేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని పత్తి పంటను పరిశీలించారు. ఆయన వెంట నాయకులు కొండూరు కేశవరెడ్డి, ఆవులంపల్లి కేశవరెడ్డి, బాలిరెడ్డి, చిన్నవడుగూరు దివాకరరెడ్డి, సుంకిరెడ్డి, రాజారెడ్డి, నారాయణస్వామి, రవిశేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, దస్తగిరి, హాజీవలి, చిరంజీవులు, హరిక్రిష్ణారావు, బాషా, నాగన్న ఉన్నారు.

జితేంద్రగౌడ్ ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-పామిడి

రాష్ట్రంలో సంపద సృష్టించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమం ఫలాలు అందరికీ అందాలంటే మళ్లీ చంద్రబాబు సిఎం కావాలని గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక టిడిపి, జనసేన నాయకులతో కలిసి మండల పరిధిలోని రామరాజుపల్లి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు, మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అలాగే వైసిపి అరాచకాలు, అవినీతి పాలన గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌గౌడ్, ధర్మతేజ్‌గౌడ్, రామ్‌తేజ్‌గౌడ్, లక్ష్మీనారాయణరెడ్డి, గౌస్, జయరామిరెడ్డి, నాగిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, పెద్ద ముత్యాలురెడ్డి, చిన్న ముత్యాలురెడ్డి, రామచంద్రరెడ్డి, ముత్యాలురెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులుగా బంగి శివ



ప్రజాశక్తి-రాయదుర్గం

అనంతపురం జిల్లా ఉత్తర ప్రాంత ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రాయదుర్గం పట్టణానికి చెందిన బంగి శివను రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభల్లో ఆల్ ఇండియా అధ్యక్షులు విపి సాను, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న, అశోక్, ఉపాధ్యక్షులు ఓతూరు పరమేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో బంగి శివను రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. బంగి శివ మాట్లాడుతూ కరువు జిల్లా అయిన అనంతపురంలో విద్యార్థుల అన్ని రకాల ఫీజులను ప్రభుత్వమే భరించాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. నిబంధనలు పాటించని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్య పరిరక్షణ, విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-నార్పల

శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలని మండల ప్రజలకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్ఐ మాట్లా డుతూ ఎవరి ఇంట్లో వారు వేడుకలు చేసుకోవాలని బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు చేసుకోవడానికి వీల్లేదని హెచ్చరించారు. 31వ తేదీ రాత్రి 10 గంటల తర్వాత గుంపులు గుంపులుగా తిరగవద్దని, ఒకే ప్రదేశంలో ఎక్కువ మంది ఉండడం కూడదన్నారు. ఆదివారం సాయంత్రం నుంచే వాహనాలు తనిఖీ చేస్తామని నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి 10 గంటల తర్వాత బార్స్, హోటల్స్, రెస్టారెంట్లు, టీ అంగళ్లు మూసివేయాలన్నారు.

మైనర్లకు బైక్‌లు ఇస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపితే వారిపై కఠిన చర్యలు తప్ప వని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్ఐ మాట్లాడుతూ నార్ప లలో ఇటీవల కాలంలో చాలామంది మైనర్ విద్యార్థులు ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడుపుతూ వారు ప్రమాదాలకు గురి కావడంతో పాటు ఇతరులను కూడా ప్రమాదాలకు గురి చేస్తున్నారన్నారు. కావున 18 ఏళ్ల లోపు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, లైసెన్స్ లేకుండా ఎవరైనా వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. అలాగే డిసెంబర్ 31వ తేదీ తమ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు, ఎవరితో తిరుగుతున్నారు, తదితర విషయాలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలన్నారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి జూపూడి పరామర్శ

ఉరవకొండ : ఎమ్మెల్సీ వై.శివరామరెడ్డిని ఎపి ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని శివరామరెడ్డి ఇంట్లో పరామర్శించారు. ఈ నెల 7వ తేదీ శివరామి రెడ్డి సతీమణి స్వర్గస్తులైన విషయం విదితమే. దీంతో శివరామిరెడ్డి మిత్రుడు, సహచరుడైన ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ ఎమ్మెల్సీ ఇంటికి చేరుకుని ఉమాదేవమ్మ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే శివరామరెడ్డిని, ఆయన కుమారుడు భీమిరెడ్డిని ఓదార్చారు. ఎమ్మెల్సీని పరామ ర్శించిన వారిలో రాజగోపాల్‌రెడ్డి, కణేకల్లు సింగిల్‌విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, పలువురు రాజకీయ నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో రమణయాదవ్, తిప్పారెడ్డి, సూర్యనారాయణ, జరుట్ల రాంపురం సర్పంచి తిరుపాల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని పరామర్శిస్తున్న జూపూడి ప్రభాకర్


నారా లోకేష్‌కి పూలబొకే అందజేస్తున్న ఎంఎస్.రాజు

నారా లోకేష్‌ని కలిసిన ఎంఎస్.రాజు

శింగనమల : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని శనివారం ఉండవల్లిలోని వారి నివాసంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజు లోకేష్‌కి ముందుగా ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే శింగనమల నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, రాజకీయాలపై చర్చించారు.

కానిస్టేబుల్ వ్యవహారంపై డీఎస్పీ విచారణ

శింగనమల : మద్యం మత్తులో వీరంగం సృష్టించిన కానిస్టేబుల్ వ్యవహారంపై శనివారం డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి విచారణ చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ షబ్బీర్ అతిగా మద్యం తాగి రోడ్డుపై వీరంగం సృష్టించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారి ఆదేశాల మేరకు అనంతపురం డీఎస్పీ బి.వెంకటశివారెడ్డి శనివారం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ షబ్బీర్ వ్యవహారంపై విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా ఎస్పీకి సమర్పిస్తానన్నారు.

శ్రీరామ్ ఫౌండేషన్‌కు ఉత్తమ సేవా పురస్కారం

రాయదుర్గం : పట్టణంలోని వి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం శ్రీరామ్ ఫౌండేషన్‌కు ఉత్తమ జాతీయ సేవా పురస్కారం అందజేశారు. వి ట్రస్ట్ తరపున శ్రీరామ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అనూషకు ముఖ్య అతిథి స్థానిక సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు పురస్కారం అందజేశారు. అనూష మాట్లాడుతూ సమాజ సేవ కోసం తన తండ్రి శ్రీరామ్ నిరంతరం కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో శ్రీరామ్ ఫౌండేషన్ స్థాపించి సమాజానికి సేవలందిస్తున్నామన్నారు. అనతికాలంలోనే పురస్కారం అందుకో వడం సంతోషంగా ఉందని, ముందు మరిన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో వి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు విజయకుమార్ పాల్గొన్నారు.


అనూషను సత్కరిస్తున్న వి ట్రస్టు నిర్వాహకులు


జాతీయ స్థాయి స్కూల్ చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జాతీయ స్థాయి స్కూల్ చెస్ పోటీలకు 14 మంది ఎంపిక

అనంతపురం : ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్లు నిర్వహించి 10 టోర్నమెంట్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రతి క్యాటగిరీలో టాప్-5 క్రీడాకారులను 2024లో జరిగే జాతీయ స్థాయి స్కూల్ చెస్ టోర్నమెంట్‌కు ఎంపిక చేశారు. **బాలికల విభాగం :** అండర్-6లో ఆషిఅలీషేక్(4వ స్థానం), కాశి సమిక(10), అండర్-8లో గిద్దల్ షారన్ బ్లెస్సీ(1), పల్లినేని హారికచౌదరి(4), చీమల ఉపేక్ష రెడ్డి(5), అండర్-10లో అవుటి సుకృత(2), యసస్విని అనిమి(3), రెడ్డమ్మగారి తేజస్వి (4), హద్విత సంపంగి(5), అండర్-12లో అస్మితఅనిమి(2), కాశీ నౌమిక(7), వాసి సారిక(8), అండర్-14లో ఎం.హాసిని ఎం(6), అండర్-16లో గీతా మాధురి (10). **బాలుర విభాగం :** అండర్-8లో మునకల శ్రీసాకేత్(2), అండర్-10లో కె.సాయియశస్(1), రిషిక్ దుద్యాల(6), గణేష్ సాయి జింకా(8), అండర్-12లో కెవిఎస్.చేతన్‌రెడ్డి, జొన్నగడ్డల నితీష్ చౌదరి(6), అండర్-14లో కృష్ణ సుధీంద్ర వెంకట(2), అండర్-16లో చరణ్ దీప్ విల్లూరు(4) ప్రతిభ చాటారు. ప్రతి విభాగంలో టాప్-5 క్రీడాకారులకు నగరంలోని 1వ రోడ్డులో ఉన్న చెస్ బెనిఫిట్స్ ఎడ్యుకేషన్ వేదికగా అనంతపూర్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్‌నాయుడు జ్ఞాపికలు అందజేశారు. ఎంపికైన టాప్-5 క్రీడాకారులకు జాతీయస్థాయి పోటీల ప్రవేశ రుసుమును ఆంధ్ర చెస్ అసోసియేషన్ చెల్లిస్తుంది.

బిసాటి భరత్‌కు దేశ అత్యున్నత 'యువ' పురస్కారం



అనంతపురం : భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యువతకు అందించే అత్యున్నత 'యువ' పురస్కారానికి బిసాటి భరత్ ఎంపికయ్యారు. ఈ అవార్డును జనవరి 12వ తేదీ జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే 27వ జాతీయ యువజనోత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోడీ నుంచి అందుకోనున్నారు. పుట్లూరు మండల పరిధిలోని కందికాపుల గ్రామానికి చెందిన బి.ఆదినారాయణ, బి.చంద్రికాదేవి దంపతుల కుమారుడే బిసాటి భరత్. ఈయన ఎస్కేయూలో మాస్టర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్, ఎకనామిక్స్‌లో పట్టా సాధించారు. 2014లో 'ప్రగతి పథం యూత్ అసోసియేషన్' అనే స్వచ్ఛంధ సంస్థను స్థాపించి నెహ్రూ యువ కేంద్రం, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సైనిక సంక్షేమ శాఖ లాంటి ప్రభుత్వ, స్వచ్ఛంధ సంస్థలతో కలిసి జిల్లాలో అనేక సేవా కార్యమాలు నిర్వహించారు. అంతర్జాతీయ సమావేశాల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకొన్నారు.

పొలిటికల్ హీట్..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

చలికాలం వచ్చేసింది. చలి తీవ్రత పెరుగుతున్న సమయంలో ఎన్నికలు సమీస్తుండటంతో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపిల్లో టిక్కెట్లపై కసరత్తు నడుస్తుండటంతో రాజకీయాలు వేడెక్కాయి. ప్రధానంగా వైసిపిలో సమన్వయకర్తల మార్పులుంటాయని ప్రచారం జరుగుతున్నాయి. దీంతోపాటు అధిష్టానం కూడా కొంత మంది నాయకులను ఈ వారంలో పిలిపించి మార్పులు, చేర్పులపై స్పష్టతనివ్వడంతో ఇది మరింత వేడిని రాజేశాయి. కదిరి, పెనుకొండల్లో మార్పులు చేయకుండా సిట్టింగ్ సిద్ధారెడ్డి, శంకరనారాయణలకే ఇవ్వాలని నిరసనలు సైతం చేపట్టారు. తక్కిన చోట కూడా మార్పులపై ఆందోళనలు నెలకొని ఉన్నాయి. ఎవరికి అవకాశం లభిస్తుందోనన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. ఈ మార్పులకు అనుగుణంగా ప్రతిపక్ష టిడిపిలోనూ ఉంటాయన్న ప్రచారం నడుస్తోంది. ఇందులో ఎవరికి టిక్కెట్టు ఇస్తారు..ఎవరికివ్వరన్న దానిపైనే అంతటా చర్చ నడుస్తోంది. ఈ రకంగా ఈ వారంలో టిక్కెట్ల ఫీవర్ రాజకీయాల్లో మొదలైంది.

ఈవారంలో ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన పోరాటం కూడా వేడిని రాజేసింది. రోజురోజుకూ పోరాటాలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. అంగన్‌వాడీలు చేపట్టిన నిరసనలు 19 రోజులు పూర్తయ్యాయి. నేతల ఇళ్లను ముట్టడించే కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనికి అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా పాల్గొని మద్దతునిస్తున్నారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బికె.పార్థసారథి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి తదితరులు మద్దతు తెలిపారు. అనంతపురంలో మేయర్ వసీం కూడా మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతునివ్వడం గమనార్హం. అంగన్‌వాడీలకు తోడు ఆశ వర్కర్లు, పంచాయతీలు కార్మికులు, మున్సిపల్ కార్మికులు, కెజిబివి ఉద్యోగులు మొత్తం రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ఎన్నికలకు ముందు, తరువాత ఇచ్చిన మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు ఉండకపోవడంతో ఆందోళనలు తీవ్రరూపం చేస్తున్నారు. రోజుకోక రూపంలో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ ఆందోళనను అణచిపెట్టేందుకు ప్రభుత్వం పోలీసుల ద్వారా బలప్రయోగం చేస్తోంది. అయితే కార్మికులు పోరాటంలో ఎక్కడా వెనక్కు తగ్గే పరిస్థితులు కనిపించడం లేదు. పోరాటాలను మరింత తీవ్రతరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం ఆగబోదని హెచ్చరిస్తున్నారు.

ఈ వారంలో ఘోరమైన ప్రమాదాలు చోటు చేసుకన్నాయి. గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద ట్రాక్టరుపై బియ్యం అడించుకుని ఇంటికిపోతున్న వారిని బస్సు ఢీకొన్న ప్రమాదంలో రైతులు నలుగురు మృత్యువాతపడ్డారు. ఇది మరువకముందే శుక్రవారం నాడు మరో ప్రమాదం చోటు చేసుకుంది. నార్పల మండలం కేశేపల్లి వద్ద బైకుపై వెలుతున్న నలుగురు విద్యార్థులు ప్రమాదానికి గురయ్యారు. అందులో ముగ్గురు మృతి చెందగా, మరో బాలుడు తీవ్రంగా గాయపడి ఉన్నాడు. ఈరెండు ప్రమాదాలు అత్యంత విషాదకరమైన ఘటనలుగానున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటంతో కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది. ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు సంఖ్య పెరుగుతోంది. అంతకు మునుపు వారంలో అనంతపురం రూరల్ మండలంలోనూ ఐషర్ వాహనం ప్రమాదంలో ముగ్గురు కర్నాటకవాసులు మృతి చెందారు.

పకడ్బందీగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్సీ ఎస్టీ సమస్యల పరిష్కారానికి అధికారులందరూ కృషి చేయాలనికలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ భరత్, డిఆర్ఒ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు న్యాయం చేయడంతో పాటు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ చట్టం పైన ఎస్సీ ఎస్టీ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ మెంబర్లకు సూచించారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం అర్ధ ఎకరా స్థలాన్ని సేకరించాలన్నారు. ఎస్సీ ఎస్టీ కాలనీలలో అవసరమైన శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలన్నారు. అందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వారం రోజుల లోపల రెవెన్యూ అధికారులు స్థల సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నెల మండలాల పరిధిలో ఒక గ్రామంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. అందుకు ప్రణాళికలు తయారు చేసుకుని అమలు చేయాల్సిన బాధ్యత ఆర్డీవోలు, తహశీల్దార్లపై ఉందన్నారు. ప్రస్తుత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తదుపరి సమావేశం నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సికేపల్లి మండలంలో దళితుల శ్మశాన వాటిక స్థల సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపడతామన్నారు. ముదిగుబ్బ మండలంలో జెకేపల్లి తండా ప్రజలకు సిసి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ భూ సమస్యలపై త్వరలో జాయింట్ కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రధానంగా శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని సమస్యలను అధికారుల దష్టికి తెచ్చినప్పుడు వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, ఆర్డీవోలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, సురేష్ రెడ్డి, డీఎస్పీలు వాసుదేవన్, హుస్సేన్ పీరా, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, కమిటీ సభ్యులు వీరనారాయణ, ఆరుద్ర, గంగులయ్య, శ్రీనివాసులు, సురేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మ్యానువల్ స్కావెంజింగ్ నిషేధం: కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో మ్యానువల్ స్కావెంజింగ్‌ను (భూగర్భ డ్రైనేజీలో మనుషులతో శుభ్రం చేయు విధానం) పూర్తిగా నిషేధించినట్లు కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మ్యాన్యువల్ స్కావెంజర్ చట్టం 2013 లోని నియమాలు, మ్యాన్యువల్ స్కావెంజర్లకు పునరావాసం పై కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ తో పాటు ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ భరత్, డిఆర్ఒ కొండయ్య, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కావెంజర్ల నిషేధం ఈనెల 6 నుండి అమలులోకి వచ్చిందన్నారు. ఇప్పటినుంచి భూగర్భ డ్రైనేజీ పరిశుభ్రత కోసం ఏ వ్యక్తిని నియమించడం కుదరదు అన్నారు. అలా ఉల్లంఘించి ఇలాంటి పనులు ఎవరైనా వ్యక్తిని లేదా ఏజెన్సీని వినియోగిస్తే పై చట్టం ప్రకారం రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష, ఒక లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు, బూట్లు, మాస్కులు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మాన్యువల్ స్కావెంజర్సుగాఉన్న వారికి నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, నాగలక్ష్మి, లక్ష్మీనారాయణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాలు

జిల్లాలోని వివిధ గిరిజన తండాలలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసి అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ భరత్, డిఆర్ఒ కొండయ్య, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో గిరిజన తండా ప్రజలు ఎక్కువగా ఉన్న మండలాలను గుర్తించి వారికి సురక్షితమైన తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇని ఆదేశించారు. విద్యుత్ సౌకర్యం మెరుగుపరచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గిరిజన సంఘాల నాయకులు అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలో పాల్గొన్న టిడిపి నాయకులు

పెనుకొండ : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన కనకదాసు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పెనుకొండకు చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో కురుబ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్, పెనుకొండ నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ నాయకులు కురుబ కృష్ణమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కనకదాసు చిత్ర పటం అందజేత : టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆధ్వర్యంలో శనివారం కుప్పంలో జరిగిన కనకదాసు విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుకి సవితమ్మ కనకదాసు చిత్ర పటాన్ని అందజేశారు.

కురుబలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : కురుబ కులానికి సంబంధించిన అంశాలను నెరవేర్చాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారధి చంద్రబాబును కోరారు. కుప్పంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన కనకదాసు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పార్థసారధి పాల్గొన్నారు. ఈసందర్భంగా కురుబల సమస్యలపై చంద్రబాబుతో ఆయన చర్చించారు.

గొర్రెలకు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి-బెళుగుప్ప

పారుడు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని ఎన్.గుండ్లపల్లి, శీరంగాపురం, అంకంపల్లి, యలగలవంక తండా గ్రామాల్లో గొర్రెలు, మేకల కాపర్లకు పారుడు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అలాగే 4,795 జీవాలకు పారుడు వ్యాధి(పిపిఆర్) నివారణ టీకాలు వేశారు. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా ఈ టీకాలు వేస్తామన్నారు. పశు వైద్యాధికారి డాక్టర్ ఎ.రమేష్ మాట్లాడుతూ గొర్రెలు, మేకలు రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

శ్రీచైతన్య స్కూల్‌లో ఘనంగా స్పోర్ట్స్ డే



క్రీడాజ్యోతితో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది



సాయివిజ్ఞాన్‌లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రుద్రంపేట శ్రీచైతన్య పాఠశాలలో శనివారం స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎజిఎం సుబ్బారెడ్డి హాజరై క్రీడా పతకాన్ని ఎగురవేసి, క్రీడా జ్యోతిని ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సాదించాల న్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ దేహదారుఢ్యం, శక్తి సామర్థ్యాలను పెంచుకోవాలన్నారు. క్రీడా పోటీల విజేతలకు పతకాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన వివిధ రకాల ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీదేవి, సరిత, అమరావతి, విజయకృష్ణ, శివప్రసాద్, మధుకర్, విష్ణు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు

నగరంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల-7 బ్రాంచ్‌లో శనివారం ప్రిన్సిపల్ పర్వీన్ అధ్యక్షతన ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఘనంతా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎజిఎం సుబ్బారెడ్డి హాజరై విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమలో ఉన్న చెడుని వదిలి తోటి వారితో మంచిగా ఉండాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీన్ చంద్రమోహన్, ప్రైమరీ ఇన్‌ఛార్జి మాధవి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి కోమలి, సిబ్బంది పాల్గొన్నారు.

సాయి విజ్ఞాన్‌లో..

నగరంలోని మూడో రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్లు ఎంపి.శ్రీనివాసులు, కరుణాకర్‌బాబు, ప్రిన్సిపల్ లావణ్య రామ్ విద్యార్థులతో కలిసి కేక్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కొత్త ఏడాదిలో మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు.

కోరం లేక మున్సిపల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి కదిరి అర్బన్

మున్సిపల్ కార్యాలయంలో జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక శనివారం వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. టిడిపి కౌన్సిలర్లు, స్వతంత్ర కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. వైసిపి కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో కోరం లేక వాయిదా పడినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే సిద్దారెడ్డికి మద్దతుగా నిలిచి శనివారం జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు గైర్హాజరైనట్లు తెలుస్తోంది. తమ స్వప్రయోజనాల కోసం ప్రజా సమస్యలపై చర్చించే సమావేశాలకు హాజరుకాకపోవటంపై ప్రతిపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పవన్ కళ్యాణ్ పై వ్యాఖ్యలు సరికాదు : జనసేన

ప్రజాశక్తి కదిరి అర్బన్

జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌పై సిఎం జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరంలో చిన్న పిల్లల ముందు పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంపై సిఎం విమర్శలు చేయడం చూస్తుంటే జగన్ మనస్తత్వం ఏపాటిదో అర్థం అవుతోందన్నారు. పవన్‌కళ్యాణ్ లేవనెత్తిన అంశాలపై సమాధానం చెప్పకుండా దొంకతిరగుడు గా వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడి తప్పించుకోవాలని చూడడం సమంజసం కాదన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

ప్రజాశక్తి - బెళుగుప్ప

'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా శనివారం స్థానిక శ్రీ శ్రీనివాసా విద్యానికేతన్ పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను కరస్పాండెంట్ శ్రీనివాసులు, సర్పంచి సాలిబాయి గంగ్యానాయక్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలు ప్రతిఒక్కరిలో ఉత్సాహం నింపుతాయన్నా రు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కాలువపల్లి వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, కెజిబివి పిడి సంధ్యసుమ, పిడి రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

రొద్దం : పౌరహక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ అనంతాచారి సూచించారు. శనివారం మండలంలోని తురకలపట్నం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : రాజ్యాంగంకల్పించిన ప్రాథమిక హక్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ స్వాతి తెలిపారు. మండల పరిధిలోని పోతులకుంట గ్రామంలోని ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వేణు నరేష్ డివిఎంసి సభ్యులు రామాంజనేయులు పోలీసులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

ముదిగుబ్బ : ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలని జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్ అన్నారు. మండలకేంద్రంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన క్రీడాకారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ సర్పంచి లక్ష్మీదేవి చంద్రాయుడు, సచివాలయాల కార్యదర్శి భాస్కర్. ఎంపీటీసీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం

పామిడి మండలం గజరాంపల్లిలో బి.నాగమణి, ఉరవకొండ మండలం బూదగవిలో పి.రాధమ్మ, చిన్న ముష్టూరులో ఎం.వరలక్ష్మి నిర్వహిస్తున్న రేషన్ షాపులను శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. దాడుల్లో సిఐ వి.వెంకటరమణ, ఎస్ఐలు శేషగిరి, జయపాల్‌రెడ్డి, ఫణీంద్రనాథ్ రెడ్డి, ఎఒ వాసుప్రకాష్, డిఇఇ యోగేష్ బాబు, ఎఇలు టి.రాజశేఖర్, రవీంద్రనాథ్, ఎసిటిఒ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.